# 'కడుపు కోత'లను అరికట్టండి

- సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- ప్రైవేట్ దవాఖానలపై దృష్టిపెట్టాలని ఆదేశాలు




'నమస్తే' కథనం పై స్పందించి ఎక్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ చేసిన పోస్ట్

జగిత్యాల, మే 31, (నమస్తే తెలంగాణ) : సాధారణ కాన్పులు పెంచాలని, సిజేరియన్లకు అడ్డుకట్ట వేయాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అందుకు సంబంధించి రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, వైద్యాధికారులు, జిల్లా పాలనాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 'మళ్లీ పెరిగిన కడుపు కోతలు' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలను పెంచాలని స్పష్టం చేశారు. సాధారణ కాన్పులతో కలిగే ప్రయోజనాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, ప్రైవేట్ దవాఖానల్లో జరుగుతున్న ప్రసవాలపై దృష్టి సారించాలని, అనవసరంగా కడుపు కోతలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఇదీ నమస్తే కథనం**

ఇటీవలి కాలంలో మళ్లీ కడుపు కోతలు పెరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో జరుగుతున్న ప్రసవాల్లో అత్యధిక శాతం సిజేరియన్లే ఉంటున్నాయి. ఏడాది క్రితం వరకు జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో 65 శాతం, ప్రైవేట్‌లో 35 శాతం ప్రసవాలు నమోదు కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పరిస్థితి మారింది. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు 48 శాతానికి, ప్రైవేట్‌లో 52 శాతం పెరిగాయి. అలాగే, గవర్నమెంట్ దవాఖానల్లో 60 శాతానికి పైగా ప్రసవాలు సిజేరియన్ల ద్వారా జరుగుతున్నట్టు లెక్కలు చెబుతుండగా, 40 శాతానికిలోపే సాధారణ కాన్పులు ఉంటున్నాయి. ఇక ప్రైవేట్‌లో కేవలం 13 శాతమే సాధారణం కాగా, 87 శాతం సిజేరియన్లే నమోదవుతున్నాయి. ఇలా సమగ్ర వివరాలతో 'మళ్లీ పెరిగిన కడుపు కోతలు' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ప్రచురించింది. సిజేరియన్లతో మహిళలు అనారోగ్యం బారిన పడడమే కాదు పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్నదని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో రాష్ట్ర యంత్రాంగం కదిలింది.

# ఎండ @ 47.1 డిగ్రీలు

- కమాన్‌పూర్‌లో అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు

జగిత్యాల టౌన్, మే 31 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. శుక్రవారం దంచికొట్టాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో గరిష్ఠంగా అత్యధికంగా 47.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లలో 46.4, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 46.0, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఎండ తీవ్రతకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రాత్రి వేళలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా 36 డిగ్రీలకు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేడిగాలులు వీస్తుండడంతో ఉపశమనం కోసం తండ్లాడుతున్నారు.



# 'భూ బాగోతం'లో వీఎల్ టీ రద్దు

- ఇంటి నంబర్ కూడా తొలగింపు
- 'నమస్తే' కథనానికి స్పందన

జగిత్యాల టౌన్, మే 31: 'జగిత్యాల మున్సిపాలిటీలో భారీ భూ భాగోతం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన కథనం సంచలనం సృష్టిస్తూనే ఉన్నది. మొదటి రోజు నుంచే సమగ్ర విచారణ కొనసాగుతున్నది. ఇప్పటికే కలెక్టర్ యాస్మిన్ భాషా రంగంలోకి దిగగా.. కబ్జాదారుడితోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రికార్డులు పరిశీలించారు. తాజాగా కబ్జా చేసిన వ్యక్తి ఇంటి నంబర్‌ను మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు రద్దు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరు వర్గాల వారికి మూడు రోజులు గడువు (మే 27 నుంచి 29వరకు) ఇచ్చారు. 2011లో స్థలాన్ని కొనుగోలు చేసిన కేవిజయలక్ష్మి, ఇతరులు మే 29న తమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సమర్పించారు. మున్సిపల్ అధికారులు వాటిని పరిశీలించారు. కబ్జాకు పాల్పడిన ఖాజా అమీరుద్దీన్ మాత్రం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కానీ, ఏ ఇతర పత్రాలు కానీ సమర్పించలేదని కమిషనర్ తెలిపారు. 1999లో జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో లేని హస్నాబాద్ గ్రామపంచాయతీకి చెందిన 12గుంటల భూమిని అప్పటి మున్సిపల్ కమిషనర్ ద్వారా వీఎల్‌టీ కట్టేందుకు పత్రాలు సృష్టించారని, ఒకే రోజు 14 ఏళ్ల వీఎల్‌టీ ట్యాక్స్ చెల్లించి 4-4-325/1/ఏ పేరిట ఇంటి నంబర్ పొందారని చెప్పారు. కబ్జాచేసిన వ్యక్తికి సంబంధించి వీఎల్‌టీ ట్యాక్స్, ఇంటి నంబర్‌ను శుక్రవారం రద్దు చేసినట్టు తెలిపారు.

# గుట్టలు గుట్టలుగా చేనేత వస్త్రాలు

**ఆరు నెలల నుంచి సంఘాల్లోనే ₹20 కోట్లకుపైగా విలువైన వస్త్రాలు**

## సర్కారు చోద్యం.. నేతన్న దైన్యం

- కేసీఆర్ సర్కారు ఉన్నంత వరకు సజావుగా కొనుగోళ్లు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే తిప్పలు
- పట్టని టెస్కో.. డిసెంబర్ నుంచి ఖరీదు బంద్
- ఉమ్మడి జిల్లాలోని సంఘాల్లో పేరుకుపోయిన నిల్వలు
- నిలిచిపోయిన మగ్గాలు
- ఆందోళనలో కార్మికులు
- సర్కారు ఆదుకోవాలని వేడుకోలు

**చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా తయారైంది. రెక్కలు ముక్కలు చేసుకొని నేసిన మగ్గం బట్ట, ఆరు నెలల నుంచి గోదాముల్లో మూలుగుతున్నది. 27 చేనేత సహకార సంఘాల పరిధిలో ₹20 కోట్లకు పైగా విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. కొత్త సర్కారు వచ్చిన తర్వాత అంతా తారుమారు కాగా.. ఖరీదు లేక మగ్గాలు మూతపడ్డాయి. చేద్దామంటే పని లేక.. చేతుల్లో పైసల్లేక నేతన్నల బతుకులు దుర్భరంగా మారాయి. వస్త్రాలను 'టెస్కో' ఖరీదు చేసి వెంటనే డబ్బులు చెల్లించాలని, అప్పుడే సంఘాల్లో కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందని సంఘాల పాలకులు దీనంగా వేడుకుంటున్నారు.**



వీణవంక మండలం కోర్కల్ చేనేత సంఘంలో గుట్టలుగా పేరుకుపోయిన వస్త్రాలు

ఎలిగేడు, మే 31 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 27 చేనేత సంఘాలు ఉన్నాయి. అందులో కరీంనగర్ జిల్లాలో 19, పెద్దపల్లి జిల్లాలోని కనుకులలో 1, జగిత్యాల జిల్లా కేంద్రంలో 1, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 చొప్పున ఉన్నాయి. కేసీఆర్ సర్కారు ఉన్నంత వరకు వీటి పరిధిలో 1,697 మగ్గాలు నిరంతరం పనిచేసేవి. సుమారు ఐదు వేల మంది చేనేత కార్మికులకు చేతి నిండా పని ఉండేది. తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టెస్కో) నుంచి సక్రమంగా ముడి సరుకు ఇవ్వడంతో ప్రతి నెలా ₹3 కోట్లకు పైగా వస్త్రాలు ఉత్పత్తయ్యేవి. బెడ్‌షీట్లు, లుంగీలు, టవల్స్, ప్యాంట్, షర్టింగ్ క్లాత్ ఇలా రకరకాల వస్త్రాలు తయారయ్యేవి. తర్వాత ఈ వస్త్రాలను తిరిగి టెస్కో ఖరీదు చేసేది. కానీ, ఆరు నెలల్లోనే అంతా తారుమారైంది.

**సంఘాల్లోనే ₹20 కోట్లకు పైగా వస్త్ర నిల్వలు**

అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు చేనేత మగ్గాలు సక్రమంగానే నడిచాయి. నవంబర్ నెల వరకు ఖరీదులు (ప్రొక్యూర్‌మెంట్)జరిగింది. కానీ, డిసెంబర్ నుంచి పరిస్థితి మారిపోయింది. కొత్త సర్కారు వచ్చినప్పటి నుంచి టెస్కో సహకారం కరువైంది. ముడి సరుకు ఇవ్వడం లేదు. ఇటు ఖరీదు చేయడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 27 చేనేత సహకార సంఘాల్లో ₹20 కోట్లకు పైగా విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. దాదాపుగా మరమగ్గాలన్నీ నిలిచిపోయి చేనేత కార్మికులు రోడ్డున పడ్డారు. చేద్దామంటే పనిలేక.. చేతిలో పైసల్లేక తల్లడిల్లిపోతున్నారు. ఇంత అధ్వానపు పరిస్థితి తాము ఎప్పుడూ చూడలేదని వాపోతున్నారు. రూ.కోట్ల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయి సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి సంఘాలను నడిపించలేక పోతున్నామని వాపోతున్నారు. చేనేత సంఘాల పరిస్థితి ప్రస్తుత పాలకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని సంఘాల పాలకులు, నేతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఇంతటి దారుణమైన దుస్థితిని తాము ఎన్నడూ చూడలేదని రోదిస్తున్నారు. సర్కారు తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



వీణవంక మండలం కోర్కల్ చేనేత సంఘ భవనం

**ఏ సంఘంలో ఎంత నిల్వలు?**

ఆరు నెలల నుంచి ఉత్పత్తయిన వస్త్రాలన్నీ గోదాముల్లో గుట్టగుట్టలుగా పేరుకుపోయాయి. కోర్కల్ సంఘంలో ₹1.30 కోట్లు, జమ్మికుంట శతరంజి సంఘంలో ₹కోటి, హుజూరాబాద్‌లో ₹కోటి, ఊటూరు, పచ్చునూరు, బొమ్మకల్ సంఘాల్లో రూ.50 లక్షల చొప్పున ₹1.50 కోట్లు, వీణవంకలో ₹70 లక్షలు, బాలాజీ కొత్తపల్లిలో రూ.40 లక్షలు, చొప్పదండిలో ₹80 లక్షలు, కరీంనగర్ నంబర్ 1, నంబర్ 2లో ₹1.50 కోట్లు, మన్నెంపల్లిలో ₹30 లక్షలు, కొత్తపల్లిలో ₹కోటి, కొత్తపల్లి మార్కండేయలో ₹30 లక్షలు, కొండపల్కలలో ₹90 లక్షలు, మ్యాక్స్ సొసైటీ, కొత్తపల్లి వినాయకలో ₹60 లక్షలు, లక్ష్మాజిపల్లిలో ₹60 లక్షలు, కమలాపూర్‌లో ₹1.50 కోట్లు, మరిపల్లిగూడెంలో ₹30 లక్షలు, దుద్దెనపల్లిలో ₹30 లక్షలు, పొట్లపల్లిలో ₹35 లక్షలు, శ్రీరాములపల్లిలో ₹60 లక్షలు, వేములవాడలో ₹1.20 కోట్లు, మామిడిపల్లిలో₹60 లక్షలు, హన్మాజీపేటలో ₹50 లక్షలు, సిరిసిల్లలో ₹1.50 కోట్ల విలువైన నిల్వలు పేరుకుపోయాయి.

**తక్షణమే ఖరీదు చేయాలి**



చేనేత సంఘాల పరిస్థితి పూర్తిగా అధ్వానమై పోతున్నది. ఆరు నెలల నుంచి ప్రొక్యూర్‌మెంట్ లేదు. సంఘాల దుస్థితిని ఏ నాయకుడికి చెప్పినా పట్టించుకోవడం లేదు. నేసిన వస్త్రా గుట్టలుగా పేరుకుపోయాయి. టెస్కోలో అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పులు చేసి సంఘాలను నడిపే పరిస్థితి లేదు. ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఖరీదులు బందయ్యాయి. ఎవరిని అడిగినా జవాబుదారీతనం లేదు. చేనేత కార్మికుల బతుకులు దుర్భరంగా ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చినట్టుగా చేనేత రంగానికీ ఇవ్వాలి. అప్పుడే ఈ రంగం బతికి బట్ట కడుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి సంఘాలకు నిధులు సమకూర్చాలి. తక్షణం వస్త్రాల ఖరీదు చేపట్టి ఆదుకోవాలి.

- ఏ సత్యనారాయణ, ఆప్కో మాజీ డైరెక్టర్

# స్కాలర్‌షిప్ వచ్చేదెన్నడు?

- రీయింబర్స్‌మెంట్ కోసమూ ఎదురుచూపే
- ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ బుట్టదాఖలు
- పైసా బాకీ లేకుండా చెల్లిస్తామని చెప్పి మోసం
- కరీంనగర్ జిల్లాలో ₹150 కోట్లకు పైగా పెండింగ్
- ఆర్థిక శాఖ టేబుల్‌పై మూలుగుతున్న ఫైళ్లు
- విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిడి
- చేతులెత్తేస్తున్న సంక్షేమ శాఖలు
- చోద్యం చూస్తున్న పాలకులు



**పేద పిల్లల చదువుకు సర్కారు ప్రోత్సాహం కరువవుతున్నది. ఉపకారం వేతనం అందకుండా పోతున్నది. అధికారంలోకి వచ్చిన వెంటనే పైసా బాకీ లేకుండా చెల్లిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. ఈ విద్యాసంవత్సరం ముగుస్తున్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఇప్పటికీ స్కాలర్‌షిప్పులు, రీయింబర్స్‌మెంట్ రాకపోవడమే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఒక్క కరీంనగర్ జిల్లాలో ₹150 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉండగా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై యాజమాన్యాల ఒత్తిడి పెరుగుతున్నది. ఫలితంగా కొందరికి ఎదురుచూపులే మిగిలిపోగా, మరికొందరు అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. అయినా చోద్యం చూస్తున్న అధికారులు, పాలకుల తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తున్నది.**

కరీంనగర్ కలెక్టరేట్, మే 31: పేద, మధ్య తరగతి కుటుంబాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు అందాల్సిన బోధనా రుసుంలు, ఉపకార వేతనాల కోసం ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నా, విద్యార్థుల చదువుపై పెట్టుబడి పెట్టేందుకు నిర్లక్ష్యం చేస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గడిచిన విద్యాసంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు సంబంధించి ₹150 కోట్ల వరకు పెండింగ్‌లో ఉంది. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుల వివరాలు సంక్షేమ శాఖలు సకాలంలోనే అందించినా, ఆర్థిక శాఖ టేబుల్‌పై ఫైళ్లు నిద్రపోతున్నట్లు తెలుస్తున్నది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫైళ్ల క్లియరెన్స్, నిధుల విడుదలపై ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

**విద్యార్థులపై ఒత్తిడి**

స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ కోట్లాది రూపాయలు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిడి రోజు రోజుకూ తీవ్రమవుతున్నది. ముందుగా చెల్లించి, నిధులు విడుదలైన అనంతరం తిరిగి తీసుకోవాలంటూ చెబుతుండడంతో ఆందోళన నెలకొంది. ప్రభుత్వమే బోధనా రుసుంలు చెల్లిస్తుందనే ధీమాతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు ఇప్పుడు సర్కారు తీరుతో తల్లడిల్లుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పోసప్పో చేసి బోధన ఫీజులు చెల్లిస్తుండగా, ప్రభుత్వం విడుదల చేస్తే తమ ఖాతాల్లో జమ అయిన అనంతరమైనా తమకు చెల్లిస్తారో లేదోననే అనుమానం విద్యార్థుల్లో వ్యక్తమవుతున్నది.

**కాంగ్రెస్ హామీ బట్టుదాఖలేనా..?**

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని విస్మరించింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు పైసా బాకీ లేకుండా చెల్లిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, అధికారంలోకొచ్చి ఆరునెలలు కావస్తున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు 54 వేల వరకు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉండగా, పరీక్షలకు ముందే యాజమాన్యాలు ఒత్తిడి తేగా, హామీ పత్రాలు రాసిచ్చి, పరీక్షలకు హాజరైనట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. పరీక్షలు ముగిసి ఫలితాలు కూడా వెల్లడవుతుండడం, పై చదువుల కోసం సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉండడంతో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఇప్పటి నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఫీజుల చెల్లింపులపై ఫోన్‌ల ద్వారా హెచ్చరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కోడ్ ముగియగానే విద్యార్థుల రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల మొత్తం విడుదల చేయాలని కోరుతున్నారు.






చెట్టును ఢీకొన్న గురైన లారీ

# మద్యం మత్తు.. లారీ బీభత్సం

- అదుపు తప్పి ఆరు బైక్‌లు, గప్‌చుప్ బండిని ఢీకొట్టిన వాహనం
- చివరకు వేప చెట్టును ఢీకొని ఆగిన లారీ
- నలుగురికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- లారీ డ్రైవర్ తాగినడపడంతోనే ప్రమాదం
- సుల్తానాబాద్‌లో ఘటన

సుల్తానాబాద్, మే 31: సుల్తానాబాద్‌లో శుక్రవారం సాయంత్రం ఓ లారీ బీభత్సం సృష్టించింది. మద్యంమత్తులో ఉన్న డ్రైవర్ ఇష్టమొచ్చినట్లు నడుపుతూ ఆరు బైక్‌లు, గప్‌చుప్ బండిని ఢీకొట్టడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. ఇసుక లోడ్ కోసం హైదరాబాద్ నుంచి పెద్దపల్లికి వెళ్తున్న లారీ సుల్తానాబాద్ తెలంగాణ చౌరస్తా వద్ద అదుపు తప్పింది. వేగంగా వెళ్లి పూసాల రోడ్డు చౌరస్తా వద్ద బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని ఢీకొట్టింది. అక్కడి నుంచి కుడివైపునకు తిరిగి బైక్‌పై వెళ్తున్న చొప్పదండికి చెందిన వినయ్‌కుమార్‌ను ఢీకొట్టింది. తర్వాత ఎదురుగా ఉన్న గప్‌చుప్ బండిని ఢీకొట్టి డివైడర్‌పై నుంచి దూసుకెళ్లింది. మరో నాలుగు ద్విచక్ర వాహనాలను ఢీకొంటూ వెళ్లి సంగీత మొబైల్‌షాపు వద్ద వేపచెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటనలో పూసాల రోడ్డు వైపు నుంచి వెళ్తున్న నసీమా, దిలీప్ హుస్సేన్ తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం దవాఖానకు తరలిచారు. చొప్పదండి గ్రామానికి చెందిన వినయ్ కుమార్, యూసుఫ్ గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం కరీంనగర్ దవాఖానకు తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. క్రేన్ సహాయంతో లారీని రోడ్డుపై నుంచి తొలగించారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.



కొండపైకి ఇరుముడులతో వస్తున్న దీక్షాపరులు

# దారులన్నీ కొండగట్టు వైపే

- రెండోరోజూ పోటెత్తిన భక్తులు
- ఘనంగా హనుమాన్ పెద్దజయంత్యుత్సవాలు

మల్యాల, మే 31: కొండగట్టు అంజన్న సన్నిధికి భక్తజనం పోటెత్తింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన అంజన్న దీక్షాపరులు, భక్తులతో కాషాయ శోభను సంతరించుకున్నది. హనుమాన్ పెద్దజయంత్యుత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి మూలవిరాట్టుకు అర్చకులు ప్రత్యేకాభిషేకం చేశారు. వేంకటేశ్వరస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా త్రికుండాత్మక యజ్ఞం చేశారు. ఆంజనేయుడి సన్నిధిలో దీక్షాపరులు మాల విరమణ చేశారు. ఇరుముడులు సమర్పించారు. తలనీలాలు ఇచ్చిన తర్వాత క్యూలైన్ల గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



మాలవిరమణ చేస్తున్న దీక్షాపరులు

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571